నీటి మీద దీపాలు

"మగవాళ్లు మరీ అనుమానం మనుషులు - "

"అలాగేం? - ఆడవాళ్లు మరీ అబద్ధాలకోరులు - "

"ఈ కథలో మగవాళ్ళ అనుమానాలకన్న ఆడవాళ్ళ అబద్ధాలు చాలా తక్కువగా ఉన్నాయి లెండి-"

"పైపైని చదివితే అట్లా అనిపిస్తుంది - అసలు సంగతి రెండోదేనని తెలుస్తూనే ఉంది .... అయినా, ఎక్కడిడదాకానో ఎందుకు? మనం ఉన్నాంగా - మగవాళ్ళం, ఆడ వాళ్ళమూనూ -"

"మీరూ నేనూనా? - మనకు రెండు ఉదాహరణలు ఎటా దొరుకుతాయి?"

"ఒకటైనా దొరికిందిగా!"

"ఆం... మగవాళ్ళ అనుమానాలను ఋజువు చెయ్యడానికి ...మరి రెండోదో?"

"నువ్వా ఉన్నావుగా!"

"నేనా?"

"అవును -"

"నేను అబద్ధం ఎప్పుడూ ఆడలేదు-"

"అట్లా అయితే, నే నెప్పుడూ అనుమానమూ పడలేదు-"

"ఇంతకన్న పచ్చి అబద్ధం ఏ ఆడదీ ఆడదు, ఆడలేదు!"

"సామాన్యంగా అంతే...కాని, ఓనాడు ఓ ఆడది ఆడింది....ఇంతకన్న పచ్ చ్చి.....'

"అవునవును...ఆరోజు....మీ పెళ్ళినాడు - కాదూ?"

"సరిగ్గా జ్ఞాపకం వచ్చింది...రైట్-"

"ఆమె అబద్ధం ఆడలేదే! మీ అనుమానం ఆనాటితో పోయిందని అనుకొంటూందామె...అయితే...."

"అది అనుమానం అయితే కదా, పోవడానికి!"

"అది - నిజమే నంటారా?"

"నువ్వే చెప్పాలి... ఆ అమ్మాయి మనసులోకి నేను వెళ్ళగలిగితే చెప్పేవాడిని - కాని...ఆమె మనసు కవాటాలు తెరవలా ఇంకా...."

"ఇంతకన్న మగవాళ్ళ అనుమానాలకు ఉదాహరణ ఏం కావాలి?"

ఆమె నిశ్శబ్దంగా తలవంచుకున్నది.

ఆకాశం, నక్షత్రాలూ...ఆ నల్లటి ఆకాశం మీది తెల్లని నక్షత్రాలవైపూ చూస్తూ

అతను ఆలోచిస్తున్నాడు. ఆనాడు....తన పెళ్ళినాడు...కొద్ది నెలలక్రితం...

ఆ ఉదయం ఏడున్నరకు ముహూర్తం...అప్పుడు ఆరుదాటి ఎంతో అయింది...పెళ్లికొడుక్కి తలంటి నీళ్లుపోశారు. తరవాత అతన్ని మేడమీద వదిలిపెట్టి ఎవరిపని వారు చూసుకుంటున్నారు - సంభారాలూ, అవసరాలూ సమకూరుస్తూ కొందరూ......ఆహడావుడిని చూస్తూనే కాలంగడుపుతూ కొందరూను. ఉదయానికి పెళ్లి శోభని తెచ్చి పెడుతూ సన్నాయి వాద్యం చల్లగా సాగిపోతోన్నది. కొండల్లో నదిమల్లే మెలికలు తిరుగుతూ, హెచ్చిపడుతూ - అట్లా.... అట్లా...సాగిపోతున్నది. వాళ్ళధర్మమా అని మిగిలిన వాద్యగాళ్లు ఊరుకున్నారు. వాళ్లకు ఇంకా పూర్తిగా తెలివి రానట్లున్నది.

ఎవరో గట్టివాడిమల్లేనే ఉన్నాడు వాద్యగాడు... మలయమారుతాలకు తన రాగసంగతులను జతచేసి మనసున్న వారి అంతరంగాలను కదిలిస్తున్నాడు...అపురూప సుందరులూ, ప్రశాంతతా, ఉషఃకాంతులూ..అన్నిటిలోనూ ఉన్న అందాలను జతచేసి మనస్సులలోకి పంపుతున్నాడు.

అట్లా అనిపించింది మూర్తికి....ఉదయానికీ, ఆ రాగానికీ ఎంత జట్టు! అని ...తన గదిలో ఒంటరిగా ఉన్నాడు. ఆ కిటికీలోనించి చూస్తే ఇంట్లో హడావుడిగా సాగుతోన్న ప్రయత్నాల సందడీ...ఆమధ్య సున్నితమైన ఈ రాగతరంగాల స్పర్శలూ ఎట్లా తెలుస్తాయి! ఈ కిటికీ లోనించి చూస్తే చక్కటి తోటా, పువ్వులూ - మూడో అంతస్తులో నించి చూస్తే మరీ కలిసిపోయిన చిత్ర రచనమల్లే....ఈ అందమూ, ఆ రాగమాధుర్యమూ....కొద్దిక్షణాల్లో తనది కాబోయే అందమూ, మాధుర్యమూలాగే ఎట్లా పెనవేసుకొన్నాయి!

అట్లా సాగిపోతున్నాయి అతని ఆలోచనలు...ఇంతలో శ్రీపతి వగురక్చుకుంటూ మీదికి వచ్చి గదిలోకి వచ్చాడు. ఆయాసంగానే, "మెట్లన్నీ ఎక్కేసరికి దుంపతెగిందోయ్! ఎంత పెళ్ళి కొడుకువైనా ఇంత ఎత్తుకు ఇప్పుడే వెళ్ళిపోతే, మాలాంటివాళ్లం ఏం కావాలీ?" అన్నాడు.

చూస్తోన్న దృశ్యాన్ని వదిలి కృష్ణమూర్తి ఇవతలకు తిరిగి చిరునవ్వుతో, "ఈ మాత్రం మెట్లెక్కలేక పోతే ముమ్ముందు నీ ఆకాశ హర్మ్యాల మెట్లన్నీ ఎట్లా ఎక్కుతావోయ్?" అన్నాడు - శ్రీపతి స్థూలశరీరంవంక చూస్తూ.

తానూ ఒకసారి తన వంక చూసుకుని, "అది దేవుడి కెరుకలే!...ముహూర్తం దగ్గరపడుతోంది; ఇంకా ఇక్కడే ఉన్నావేం ఒక్కడివీ?" అన్నాడు శ్రీపతి.

"ముహూర్తం వచ్చేదాకా మనకక్కడపనేమిటిలే! నువ్వు కాఫీ తాగావా?" అన్నాడు

జవాబుగా మూర్తి.

"ఆ...తెల్లారకుండా దేవాలయదర్శనం అయాక తిరిగి వచ్చేసరికి మీ మామగారు ఎంతవద్దన్నా ఉపాహారసమేతంగా కాఫీ పుచ్చుకునేదాకా ఊరుకోనిదే!" అని చిన్న నవ్వునవ్వి- "కాదు కాదంటూనే మహాఘనమైన సంబంధం కొట్టేశావోయ్!" అన్నాడు శ్రీపతి.

"ఘనాని కేముందీ - నా సంగతి నీ కాపాటి తెలుసుగా! లలితను ఎట్లాగైనా చేసుకోవాలనే అనుకున్నాను. కాకపోతే కొంచెం ఆస్తి ఉంది....." అన్నాడు మూర్తి.

"కొంచెం!" అని నొక్కి అన్నాడు శ్రీపతి. "ఇన్ని లక్షలు! ఇంకా చాలలేదంటావ్! ...ఆ అమ్మాయి విలువ ఇంకా ఎక్కువే ఉంటుందిలే..." అన్నాడు శ్రీపతి చిత్రంగా-

తేలికగా నవ్విమూర్తి "ఛీ! మనుష్యులింక రూపాయలూ అణాలలో విలువ చెయ్యలేని వస్తువు లేదంటావ్!" అన్నాడు.

కొంచెం సర్దుకుని- "అది కాదోయ్! ...లలిత అంటే నీ కెంత అభిమానమో నాకు తెలుసును... అప్రేమ లొట్టిగా గుడ్డిది కాదని నా ఉద్దేశం", అన్నాడు శ్రీపతి.

దీని కెలాగ జవాబు ఇవ్వాలో తెలీలేదు మూర్తికి. ఇంతట్లో క్రిందనుంచి మూర్తిని పిలిచా రెవరో..... ఇద్దరికీ ఆ నిశ్శబ్దంనించి విముక్తి ఇస్తూ, శ్రీపతి లేచి, "అదిగో! మీ అమ్మగారల్లే ఉన్నారు, పిలుస్తున్నారు. ఊరికే శుభాకాంక్షలు చెప్పిపోదామని వచ్చాను; వెళతాను", అన్నాడు శ్రీపతి.

అతను మాట పూర్తి చెయ్యకముందే మూర్తి కిటికీలోంచి తోటవైపు చూస్తూ, బొమ్మమల్లే అయిపోయాడు- కొద్ది క్షణాలపాటు. ఆ బిత్తరపాటు చూసి ఆశ్చర్యంగా శ్రీపతి, "ఏమిటి కనిపిస్తోంది కిటికీలోనించి అంత అద్భుతంగా?" అని. "అరే! అట్లా బిత్తరపొయ్యావేం?" అన్నాడు ఆ విషయం తానూ చూడడానికి కిటికీ వైపు వస్తూ.

శ్రీపతి దగ్గరికి వచ్చేలోపునే మూర్తి కిటికీ తలుపులు వేశేశాడు. అతని ప్రవర్తన శ్రీపతి కేమీ అర్థంకాక, మూర్తి భుజంమీద చెయ్యివేసి, "ఏమిటి సంగతి మూర్తీ?" అన్నాడు.

మూర్తి ముఖంనిండా చెమట పోసింది. కొద్ది క్షణాల క్రితం అతని ముఖంలో తాండవం చేసిన ఆనందమూ, ఉత్సాహమూ మాయమైపోయాయి. "ఏమిటి- మూర్తీ, ఏమిటి?" అంటూ శ్రీపతి అతన్ని రెండు చేతులా తీసుకున్నాడు, విషయం ఏమిటో తెలీక కొంతా మూర్తి స్థితిచూసి మరికొంతా శ్రీపతి గాభరాపడసాగాడు. ఆపరిస్థితుల్లోకూడా మూర్తి శ్రీపతిని కిటికీ దగ్గరకి పోనివ్వలేదు...కొద్ది క్షణాలలో సర్దుకుని, "క్రిందికి వెళ్ళి వెంటనే రమ్మన్నానని చెప్పి అన్నయ్యను పంపించు; మరింకెవరికీ ఏమీ చెప్పకు-" అన్నాడు మూర్తి.

ప్రశ్నించినా ఏమీ రాబట్టలేమని తెలిశాక శ్రీపతి క్రిందికివెళ్ళి మూర్తి పిలుస్తున్నాడని శేఖరంతో చెప్పాడు. అతను బయటికి వెళ్ళగానే మూర్తి కిటికీ తలుపులు రెండూ తీసి అటు చూస్తూ తలపట్టుకుని, 'భగవాన్!' అనుకున్నాడు.

శేఖరం తొందరగా గదిలోకి వస్తూ, "ఎందుకు రమ్మన్నావట?...కిందని వాళ్ళందరూ నీ కోసం చూస్తూంటే?'' అన్నాడు.

"కొంచెం జాగ్రత్తగా విను అన్నయ్యా...ఈ పెళ్ళి ఇంతటితో ఆగిపోవాలి-''

తుళ్ళిపడ్డాడు శేఖరం. "ఏమిటీ?'' అన్నాడు ఆశ్చర్యంగా.

"ఈ పెళ్ళి నేను చేసుకోబోవడంలేదు- ఇంతటితో ఆ ప్రయత్నాలన్నీ ఆగిపోవాలి'' అన్నాడు మూర్తి.

"నిద్రపోతున్నావా మూర్తీ? - ఏమిటి నువ్వంటూన్నది?- ఏం జరిగింది?''

"తెలివి వచ్చింది-కొంచెంసేపు క్రిందటనే. అందుకే ఈ పెళ్ళి వద్దంటున్నాను. క్రిందికివెళ్ళి చెప్పేయ్ అన్నయ్యా ...మనం వెంటనే వెనక్కి వెళ్ళిపోదాం''.

"నీకు మతి పోయింది'', అన్నాడు అక్కడ కుర్చీలో నీరసంగా కూలబడుతూ శేఖరం. ఇంతట్లో తిరిగి క్రిందినించి కేక వినిపించింది. శక్తి తెచ్చుకుని, తిరిగి, - "అదిగో వాళ్లు తొందరపడుతున్నారు...పిచ్చిగా మాట్లాడకు....మూర్తీ!పద!'' అన్నాడు.

ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఊరుకుని, "పిచ్చికాదన్నయ్యా!'' నన్నింకేమీ అడక్కు...సాధ్యమైనంత త్వరలో అందరికీ ఈ విషయం చెప్పేసెయ్'' అన్నాడు శేఖరం చేతులను పట్టుకుని మూర్తి.

"అసలు విషయం చెప్పు...ఏం జరిగింది?''

"క్షమించు అన్నయ్యా!...ఆవిషయం నేను మాటలాడదలుచుకోలేదు...''

"మరి విషయం ఏమిటని అడిగితే, వీళ్ళందరికీ నేనేం జవాబు చెప్పుకొనేదిరా?'

"నా మీద అంత తప్పుపెట్టు! ...దయ ఉంచి కారణం అడగకు... నా నిశ్చయం చాలా బలంగా చేసుకున్నాను - లలితను పెళ్ళి చేసుకోవడం లేదు.''

అనుమానాలకు వీలులేకుండా చెప్పేశాడు మూర్తి. శేఖరాని కేమీ తోచలేదు. అసలు ఏం జరిగిందో అతనికి అణుమాత్రమూ సూచనలేదు. లలితకోసం కలవరించిపోయి పెళ్ళిచేసుకొంటూన్న మూర్తి కొద్ది నిమిషాల క్రిందటి దాకా లేని ఈ మార్పుకు ఎట్లా గురిఅయాడోననే మహదాశ్చర్యం ఒక వేపూ, వారందరికీ జవాబు ఎట్లా చెప్పడం అనే బాధ మరోవేపూ అతన్ని కింకర్తవ్యతామూఢునిగా చేశాయి. మూర్తి అంటే అతను ప్రాణాల

నివ్వడానికి వెనుదియ్యడు; కాని, తమ్ముడు సృష్టించిన ఈ వింత పరిస్థితి తనను విచిత్రమైన కష్టాల మధ్య పారవేసింది- అతనంటే కోపమూ, అసహ్యమూ కలుగసాగాయి.

ఇద్దరూ అట్లానేఉండిపొయ్యారు కొద్ది క్షణాలు.

"నీమీద ఆశలు ఉంచుకుని వాళ్ళిన్ని ప్రయత్నాలు చేసుకున్నారు..లలిత నీ కోసం ఎన్నో స్వార్థాలను వదులుకుని, ఈ పెళ్ళికి ఒప్పుకున్నది. .. అందరూ కొద్దిసేపట్లో జరుగబోయే మీ పెళ్లి చూడాలని కాచుకుని ఉన్నారు. క్రిందికి వెళ్లి నేనేమని చెప్పేదిరా?'' అన్నాడు శేఖరం మళ్ళా. అతనికి త్వరగా క్రిందికి వెళ్ళి ఈ విషయాన్ని అందరికీ చెప్పి ఒక అంతానికి తీసుకురావాలని ఉన్నది; కాని వెళ్ళడానికి ధైర్యం రావడంలేదు.

"నేనింకేమీ చెప్పలే నన్నయ్యా!" అన్నాడు మూర్తి నీరసంగా.

"నీకు మతి చెడింది."

నిశ్చయంగా అన్నాడు శేఖరం...కొంచెం కోపంతో.

"పోనీ - అలాగ చెప్పు", అన్నాడు మూర్తి అత్రుతగా.

మళ్ళా పెళ్ళికొడుకుకోసం కేక వినిపించింది క్రిందినించి - శేఖరం బాధగా లేచి నిలబడి, కూర్చుని, ఏమీ తోచక తిరిగి నిలబడ్డాడు.

"పోనీ - మూర్తీ ... నాతోనైనా నిజంచెప్పు... ఇంత మంది ఆశలను వృధాచేసే ముందు నా మనస్సునైనా దృఢ పరుచుకోనీ!" అన్నాడు.

మూర్తి జవాబు ఇవ్వలేదు. కిటికీ ఊచలను పట్టుకుని అట్లానే నిలబడ్డాడు. తిరిగి శేఖరం, "ఇన్నాళ్ళనించి లలితని గురించి కలలు కంటున్నావే! ఇంతలో ఈ వైరాగ్యం ఏమిటి?" అన్నాడు.

మూర్తి దీనికి ఏమీ చలించలేదు- ముఖం నిండా చెమట....దాచుకున్న మిస్టరీని దాచలేకపోతున్నట్లు బాధ.

"చెప్పు! మూర్తీ!" - చివరి ప్రయత్నం చేశాడు శేఖరం బ్రతిమాలుతూ.

పూర్తిగా అతనివైపు తిరుగుతూ, "వద్దన్నయ్యా! నన్ను మాటలాడించకు! తల బ్రద్దలౌతూంది. వెళ్లు. ఏదో చెప్పు - " అన్నాడు మూర్తి.

ఇంక లాభంలేదని నిశ్చయించుకుని శేఖరం బరువుగా క్రింది బయలుదేరాడు - గుమ్మందాటగానే, మూర్తి పిలిచాడు - ఆశగా వెనక్కినడిచాడు శేఖరం.

"కొంచెం ఆగు. లలిత ఉంటుంది. ఒక్కసారి మీదికి పంపించు..." అన్నాడు.

కొంచెం తేలికపడి శేఖరం క్రిందికి బయలుదేరాడు. అతను వెళ్లిన కొద్దినిమిషాలలో

లలిత వచ్చింది- చెల్లెల్ని తోడుతీసికొని-

మూర్తి వారిద్దరినీ చూసి ఒక్కక్షణం చాలా గాభరాపడ్డాడు -లలిత అంటే అతని ఉద్దేశంలో తెల్లటిచీరా, జడలో ఒక పూవూ, మెడలో చిన్నగొలుసూ...అంతే - ఇప్పుడు అవన్నీ మారిపోయి...

పెళ్ళికూతురు వేషంలో ఉన్న లలిత చాలా సిగ్గుగా, "ఎందుకో తక్షణం రమ్మన్నారుట-" అన్నది.

"అవును ....కొంచెంసేపు ఒంటరిగా మాట్లాడాలి", అన్నాడు మూర్తి కిటికీవైపు చూస్తూ..లలితతో వచ్చిన అమ్మాయి నిశ్శబ్దంగా మెట్లు దిగిపోయింది.

వింతగా లలితవైపు చూస్తూ, "మన పెళ్లి విషయంలో - నేను చాలా పొరపాటు పడ్డానని అనుకుంటున్నాను... అందుకనే నిన్ను పిలిచాను. కొద్దిసేపటిలో మన ఇద్దరి సంబంధమూ మార్చలేనిదైపోతుంది..."

అతను చెప్పలేక, ఆగాడు - నీరసంగా లలిత కుర్చీలో కూలబడి, "ఏమిటి మీరంటోన్నది?" అన్నది.

"విను లలితా... ఈపెళ్ళి ఆగిపోవాలని నేననుకుంటున్నాను. ఆమాట చెప్పడానికే నిన్ను పిలిచాను-" తన పని తొందరగా ముగించదలుచుకున్నట్లు అనేశాడు మూర్తి.

తృళ్ళిపడింది లలిత....తనను ఆసమయంలో మీదికి పిలిచినప్పుడు ఏదో కీడు ఉందని భయం వేసింది...కాని, ఇంత అవుతుందని అనుకోడానికి ఆమెకు సాహసం లేకపోయింది.

"ఎందుకని?" అన్నది లలిత కొంచెంసేపు అట్లానే ఉండిపోయి.

సూటిగా ఆమె ముఖంలోకి చూస్తూ, మూర్తి "నాకూ తెలుసు; నీకూ తెలుసు - నా చేత అనిపించడం ఎందుకని?" అన్నాడు.

"మీరనేది నా కర్థం కావడం లేదు - ఏదో పొరపాటు జరిగినట్టుంది...వివరంగా చెప్పండి", అన్నది లలిత. మెడలో బరువైన ఈ ఆభరణాలూ, వొంటిన ఖరీదైన ఈబట్టలూ, తన క్రొత్త అలంకరణలూ తనకు అందాలను తెచ్చి ఇవ్వడం మానేసి ఒక్క క్షణంలో బరువైపోయి వెక్కిరిస్తోన్నట్లు కనిపించాయి.

"అయితే, నే ననక తప్పదా, లలితా?" అన్నాడు - కొంచెం కోపంగా మూర్తి.

"ఇన్నాళ్ళనించి మీరుకోరిన, ఇష్టంచూపిన పెళ్లి ఒక్క నిమిషంలో మీ కయిష్టం అయిపోయిందంటే ఆ కారణమైనామీరు చెప్పకపోతే ఎట్లా?" అన్నది లలిత. ఆమె

ఏడ్వడంలేదు...అంతే.

"ఒక్కమాటలో చెప్తాను. విను-కొద్ది నిమిషాల క్రింద నేనీ కిటికీలోనించి క్రిందికి చూశాడు. లేచి, ఇలాగ వచ్చి చూడు-"

లలిత లేచి అతను చూపిన కిటికీ దగ్గరకి వెళ్లి అతను చూపుతోన్న వైపు చూసింది.

"అక్కడ ఏముంది?" అన్నది.

"అవును, అక్కడ ఏముంది?" అన్నాడు మూర్తి.

లలిత మళ్ళా చూసింది అటు. అవును...అక్కడ ఏముందీ?

"నాకక్కడ మల్లెపొదా, ప్రక్కన మామిడి చెట్టూ మాత్రం కనిపిస్తున్నాయి - మీరనేదేమిటి?"

"మరేమీకాదు- అదే నేనేది...ఆమల్లెపొదలో కొంచెం సేపటి క్రింద ఒక అమ్మాయి ఏవేవో చేసింది! అలా అంటే నీకు తెలుస్తుందనుకుంటాను-"

లలిత తలవొంచుకునే ఆలోచిస్తోన్నది - తల ఎత్తకుండానే, "మీరు చిత్రంగా మాట్లాడుతున్నారు. ఆ అమ్మాయి ఎవరూ? ఏం చేసిందీ?" అన్నది.

"నీకు తెలీదూ?" అన్నాడు మూర్తి. "తెలిస్తే ఎందుకు అడగడం?" అన్నది లలిత.

ఈసారి ఆశ్చర్యపడడం మూర్తి వొంతు అయింది. తాను కళ్ళతో చూసినదాన్ని ఈమె కాదంటూందా? తనకళ్ళు తనను మోసగించాయా?

"నిజం చెప్పు లలితా - నీకు తెలీదూ?" అన్నాడు మూర్తి సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ. తనకు తెలీకుండానే ఒక్కసారి లోలోపల కంపించి పోయింది లలిత. ఆతత్తరపాటులో మాటలాడలేక ఊరుకునర్నది.

"నిజంగా - ఆపొదలో అప్పుడు నువ్వుకాదూ?"

"నేనా?"

అరిచింది లలిత. మరుక్షణం సర్దుకుని - "చెప్పండి- ఇప్పుడు కొంచెంకొంచెం తెలుస్తోంది...ఆ పొదలో ఆఅమ్మాయి - అంటే మీ ఉద్దేశంలో నేను - ఏం చేసింది?"

ఆమె గొంతుకలో నిస్సహాయతకన్న కోపమే ఎక్కువగా ధ్వనించసాగింది. ఆ జీర చెవిలోపడి, ఒక్కసారి తెలివి వచ్చినట్లయింది మూర్తికి.

అతను మాట్లాడలేదు. కథ ఇట్లా అడ్డుతిరిగాక ఏమీ అనడానికి సంసిద్ధుడుగా లేడు.

"నేనా? అక్కడా?"

ఉన్న మార్దవం కూడా అంతరించి పోయింది లలిత గొంతులోనుంచి. ఆమె కళ్ళు సిగ్గుల బరువునుంచీ, అవమానపు లోతులనుంచీ ఒక్కసారి కోపరక్తతకి మారి పోయాయ్.

మూర్తి కిటికీ వైపు ముఖం తిప్పుకున్నాడు. ఆ మల్లె పొద...అగుబురు మావిడిచెట్లు...అక్కడ...అతని కౌగిలిలో ఆమె-ఆమె కళ్లను తుడుస్తూ అతను...అప్పుడు-ఆమె వెళ్ళలేక వెళ్ళలేక వెళ్లడం...తాను చూడలేదా?

"మీరు నన్ను పిలిచి ఈ విషయం తెలియజేసిందుకు చాలా కృతజ్ఞురాలిని - నేనే క్రిందికి వెళ్లి పెళ్లి ఆగిపోయిన సంగతి చెప్పి వొస్తాను- సెలవు."

లలిత లేచింది. మూర్తి మహావేగంగా వెనక్కి తిరిగి గుమ్మాని కడ్డునిలబడి-"ఒక్కక్షణం ఆగులలితా! నన్నాలోచించుకోనీ", అన్నాడు.

లేచిన లలిత అట్లానే కూర్చుని- "మీరేమీ ఆలోచించడం అనవసరం. మీకు ఇష్టమైనా కాకపోయినా ఈ పెళ్లి నాకు ఇష్టంలేదు. అంచేత ఎలా అయినా ఫలితం ఒక్కటే" అన్నది.

"కాదు లలితా... తొందరపడకు. నాతలపాడైపోయింది...కొంచెం ఆలోచించుకోనీ" అని మూర్తి మరొక కుర్చీలోకూర్చున్నాడు. ఆ గదిలోనే ఎన్నో సార్లు లలితతో గంటలతరబడి మాట్లాడుతూ కూర్చున్న సమయాలు ఒకటీ ఒకటీ అతనికి జ్ఞప్తికి వొచ్చాయి....అన్ని రోజులనుంచీ తాను కన్న కలలూ, ఆలోచించుకున్న మధురానుభూతులూ, ఒక్కమాటతో -ఒక్క క్షణంలో మాయం అయిపోతోన్నట్లు కనిపించాయి.

ఆలోచించినకొద్దీ మూర్తికి విషయం అస్పష్టంగా బోధపడసాగింది. ఇంతదాకా వచ్చిన పెళ్లి ఈ క్షణంలో ఆగిపోయ్యాక తన మనసు ఎట్లా ఉంటుందో ఆలోచించిన కొద్దీ పెద్దలోటు తనముందు నిలిచి భయపెట్టసాగింది.

"-నేను కొంచెం తొందరపడ్డాను లలితా...ఉదయం ఆ పొద దగ్గిర నేను చూసి స్త్రీ నువ్వే ననుకున్నాను. ఉన్నది నీతో మాత్రం చెప్పి పెళ్ళి మానుకుందా మనుకున్నాను-"

లలిత ఈ సరికి కొంచెం స్థాయికి వచ్చింది.

"మా శ్యామల అయివుంటుంది". అన్నది నెమ్మదిగా,

"శ్యామల ఎవరూ?"

"మాపెదతల్లి కూతురు...దాని పెళ్లి వచ్చేనెల. అతన్ని చేసుకుందా మనుకున్నది. కాని....."

"అలాగా!" అన్నాడు మూర్తి.

"అ.....అది ముమ్మూర్తులా నా పోలికే" నన్నది లలిత.

సంభాషణ తిరిగి ఈ మాత్రం ప్రశాంతతకు రావడం చాలా సుకరంగా కనిపించి, "జరిగినదంతా మరిచిపో లలితా! పెళ్లి మామూలుగా జరగనీ!" అన్నాడు మూర్తి.

"వద్దులెండి - ఇంత అనుమానాలతో మనం సుఖ పడతామని నేను ఆశించడంలేదు" అన్నది లలిత.

"పొరపాట్లు ఎవరైనా చేస్తారు లలితా!...క్షమించడం మానవత్వం...నువ్వే నాస్థానంలో ఉంటే ఏం చేసేదానివి?" అన్నాడు మూర్తి.

లలిత జవాబివ్వలేదు. నెమ్మదిగా లేచి, అతనివైపొకసారి బరువుగా చూసి క్రిందకి వెళ్లిపోయింది.

పెళ్లి యధావిధిగా జరిగిపోయింది. లలిత తరువాత మూర్తికి శ్యామలను చూపింది.

ముమ్మూర్తులా లలితే...అయితే, తాను ఎంత చీకట్లో అయినా లలితను వేరుగా గుర్తించగలను- అనుకున్నాడు మూర్తి.

ఇవేవీ తరువాత వారి అభిమానాలకు అడ్డురాలేదు. అంతా సవ్యంగా జరుగుతోంది.

ఈనాడది అంతా జ్ఞాపకం వచ్చింది మూర్తికి. ఆ కథ చదివాక, రాత్రి భోజనాలుచేసి కూర్చున్నారు దంపతులు.... ఈ వాదన వచ్చింది.

"వెయ్యిమంది శ్యామలల మధ్య నిలబడు - నిన్ను గుర్తిస్తాను లలితా!.... ఆనాడు అత నెవరో నాకు తెలుసు....ఆమె నువ్వేననీ నాకు తెలుసు...ఇప్పుడైనా నిజం చెప్పు లలితా!" అన్నాడు మూర్తి గంభీరంగా.

అతనట్లా మాట్లాడుతోంటే ఆమె దోషిలాగే కంపించి పోతూన్నది. కొంచెంసేపు ఏప్రత్యుత్తరమూ ఇవ్వలేదు. తరువాత, "అది నిజమే అని నమ్మితే, మరి పెళ్ళి ఎందుకు చేసుకున్నారు?" అన్నది నీరసంగా.

మూర్తి తేలికగా నవ్వాడు.

"ముందర మానేద్దామనే అనుకున్నాను ఆ ఆవేశంలో - అందుకే నిన్ను పిలిచాను. నీతో చెప్పేనుకూడా.... కాని, క్రమంగా నా చర్యలోని మూర్ఖత్వం నాకు కనిపించ సాగింది...నాకళ్ళలో పడ్డావు కనక తెలిసింది - ఆ క్షణం నేను కిటికీ లోనించి బయటికీ చూడనేలేదనుకో...జీవితంలో ఎవరినో ఒకరిని పెళ్ళిచేసుకుతీరాలిగా! అట్లా ఆలోచించాను. ఆక్షణంలో నీకు వచ్చిన కోపం నేను పెద్దసంస్కర్తగానూ, విశాల హృదయుడిగానూ

నటించకుండానే నా పొరపాటుని కప్పిపుచ్చుకొనే వీలు ఇచ్చింది....నిబదులు నేనే దోషిగా నిలబడ్డాను..అదే సులువనిపించింది. ఇవాళ నిన్నడగాలని అనుకోలేదు...కాని, సంభాషణ ఇంతదాకా వచ్చేక మన యిద్దరిమధ్యా వున్న ఈతెర తొలగించుకోవాలనిపించింది....ఒక్కసారి నావైపుచూసి, నిజం చెప్పు లలితా!....నువ్వే - కాదూ?"

లలిత మాటలాడలేదు. ఆకాశంవైపు చూస్తూ అలానే ఉండిపోయింది.

"చెప్పవ్?"

ఆమె అతనివైపు తిరిగింది....రెప్ప వెయ్యకుండా చూస్తూ నిశ్శబ్దంగా వుండిపోయింది.

"నాకు తెలుసు లలితా! శ్యామల అక్కడ లేదని.... ఈ చీకటిలో నువ్వూ, పదిమంది శ్యామలలూ నిలబడండి....నాకళ్లకు గంతలు కట్టినా నిన్ను నేను గుర్తించగలను - చెప్పవ్ లలితా?"

ఆమె తలవంచుకున్నది. ఆ నిశ్శబ్దానికి అట్లానే దీర్ఘాలిస్తూ.

జవాబు కోసం కొంచెంసేపు చూసి మూర్తి ఆమె ముఖాన్ని తనవైపుకు త్రిప్పి ఎత్తాడు.

చేతికి తడిగా, వేడిగా తగిలాయి కన్నీళ్లు. అప్పటిదాకా చీకటిలో తనకు కనిపించలేదు.

"నువ్వు నిజాన్ని అర్థం చేసుకోలేవు లలితా!.... క్షమించు - మరెప్పుడూ అట్లా అడగను", అన్నాడు పశ్చాత్తాపంతో.

"మీరు నిజాన్ని తెలుసుకోలేరు- భరించలేరు. ఎప్పుడూ అడగకండి", అందామనుకున్నది లలిత.

కాని, ఆమె నిరుత్తరగా అలాగే ఉండిపోయింది - అతని కళ్ళలోకీ, వెనుక చీకట్లలోకీ చూస్తూ.

* * *